

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## నేనే

**"పెద్దమ్మా!** మా అమ్మ పాల డబ్బులు తీసుకురమ్మంది" అరుగు మీద కూర్చుని, పక్కనే ఎండపెట్టిన వడియాలని తీసి తింటూ చెప్పింది నాగమణి.

"ఉండవే. ఒక్క నిమిషం కూర్చో" వంటింట్లోంచి వినిపించింది.

పక్కగదిలో అద్దం ముందు నుంచుని తల దువ్వుకుంటున్న పల్లవి ఆమెవంక బాధగా చూసింది.

పల్లవిని గమనించిన నాగమణి విసురుగా లేచి చెప్పింది.

"పెద్దమ్మా! నీ చెయ్యి ఖాళీ అయ్యాక గోడమీంచి పిలు. వస్తా! నే పోతున్నా" వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

"హు" పల్లవి బాధగా నిట్టూర్చింది.

నాగమణి, పల్లవి ఇళ్ళు పక్కపక్కనే కాబట్టి, పగలంతా ఇద్దరూ ఏదో ఓ ఇంట్లో వుండేవారు తప్ప దూరంగా వుండేవారు కారు. నాగమణికి తండ్రి లేడు, తల్లి నాలుగైదు గేదెలతో పాలవ్యాపారం చేస్తుంది. పల్లవి తండ్రి సన్నకారు రైతు. ఇద్దరి ఆర్థిక పరిస్థితి దాదాపు ఒక్కలాంటిదే. తల్లుల మధ్య స్నేహం కొనసాగి పిల్లలిద్దరూ గాఢ స్నేహితులయ్యారు. పచ్చగా, బొద్దుగా బంతిపూవులా అందంగా వుండే నాగమణి వెనక, నల్లగా సన్నగా చిన్నగా సామాన్య రూపురేఖలతో వుండే పల్లవి నీడలా తిరిగేది. ఇద్దరూ కలిసి స్కూల్‌కి వెళ్ళేవారు. కలిసి చదువుకునేవారు. అప్పుడప్పుడు పల్లవి ఇంటికి వచ్చే ఆమె మేనమామ కొడుకు శేఖర్ కూడా వీళ్ళతో కలిసి ఆడుకునేవాడు. సన్నగా, పొడుగ్గా కొంచెం ఎత్తు పళ్ళతో వికారంగా వుండే శేఖర్ పల్లవికి కాబోయే మొగుడని పెద్దలు నిర్ణయించారు. దాంతో నాగమణి ఆ ఇద్దర్నీ ఎగతాళి చేస్తూ, వాళ్ళమీద అజమాయిషీ చేస్తూండేది.

పదోతరగతి పరీక్షలు ముగిసాక ఆ వేసవి సెలవుల్లో కొన్ని ముఖ్య సంఘటనలు జరిగాయి.

పల్లవి తండ్రి పూరిల్లు పడగొట్టి ఆ స్థలంలో చిన్న డాబా ఇల్లు కట్టాడు. పల్లవి, నాగమణి మంచి మార్కులతో పాసయ్యారు. పల్లవి ఇంటర్మీడియట్‌లో చేరింది. నాగమణి తల్లి కూతురు కాలేజ్‌లో చేరడానికి ఒప్పుకోలేదు. తండ్రిలేని పిల్లకి సాధ్యమైనంత త్వరగా

పెళ్ళిచేసి పంపాలని ఆవిడ ఆలోచన. సెలవులకి వచ్చినప్పుడల్లా పల్లవితో పాటు నాగమణితో తిరుగుతూ వాళ్ళతో చింతగింజలు, తొక్కుడు బిళ్ళ ఆటలు ఆడే శేఖర్‌కి ఎం.సెట్‌లో మంచి రేంక్ వచ్చి ఎం.బి.బియస్‌లో సీట్ వచ్చింది.

నాగమణి పల్లవితో మాట్లాడటం మానేసింది.

పల్లవి విలవిల్లాడిపోయింది. ఏడ్చింది. కారణమేమిటో నోరు విప్పి చెప్పమంది. ఇద్దరి తల్లులతో చెప్పించింది. ఐనా నాగమణి పెదవి కదపలేదు. పల్లవితో మాట్లాడలేదు సరికదా ద్వేషించసాగింది. ఆ ద్వేషంకూడా అందరికీ అర్థమయ్యేలా ప్రస్ఫుటంగా.

కాలేజ్‌లో కొత్త ఫ్రెండ్స్ ఏర్పడినా పల్లవికి నాగమణి స్నేహం లేనిలోటు లోటుగానే మిగిలిపోయింది. అంత నేరం తనేం చేసిందో ఆమెకి అర్థం కాలేదు. శేఖర్ ప్రయత్నించినా నాగమణి తల తిప్పుకుని వెళ్ళిపోయింది.

"నాగు వాళ్ళు ఇల్లు, గొడ్లు అమ్మేసి మేనమామ ఇంటికి వెళ్ళిపోతున్నారట" ఆ సాయంత్రం కాలేజ్ నించి వచ్చిన పల్లవితో తల్లి చెప్పింది.

"అవునా? ఎందుకు?" పల్లవి దిగులుగా అడిగింది.

"అన్నగారి సహాయంతో నాగు పెళ్ళి చేయాలని పిన్ని అనుకుంటోంది. ఈ పాల వ్యాపారం అక్కడే చేసుకుంటుందిట. ఈడొచ్చిన పిల్లతో మగతోడు లేకుండా వుండడం కష్టం అనుకుంటోంది. మేమందరం వున్నాం అని ఎంత చెప్పినా వినడం లేదు."

పల్లవి పక్కింటికి పరిగెత్తింది. ఇల్లు చిమ్ముతున్న నాగమణి చీపురు అక్కడ పారేసి దొడ్లోకి వెళ్ళిపోయింది.

"నాగూ మీరు వెళ్ళిపోతున్నారా? ప్లీజ్ నాతో మాట్లాడవే. కనీసం నామీద నీకు ఎందుకు కోపం వచ్చిందో చెప్పు." అర్థించింది.

మౌనమే సమాధానం

వాళ్ళు వెళ్ళిపోయినా పల్లవి చాలాకాలం నాగమణి లేని లోటుని అనుభవిస్తూనే వుంది. ఆమె గుర్తొచ్చినప్పుడల్లా పల్లవి కళ్ళు చెమర్చుతూనే వున్నాయి.

భర్త ఆఫీస్ వారితో మాట్లాడుతున్న నాగమణికి దూరంగా ఓ టేబుల్ ముందు కూర్చుని వున్న యువతిని చూడగానే ఎక్కడో చూసానే అనిపించింది.

సాధారణ కాటన్ చీర, సన్నగా, పొట్టిగా చామనచాయగా వున్న రూపం, బారెడు జడ. వెంటనే గుర్తుపట్టింది. పల్లవి.!!

వెంటనే లేచి వెళ్ళి బిడియంగా కూర్చుని వున్న ఆమెతో చెప్పింది.

"పల్లవీ! నువ్వు పల్లవే కదా?"

పల్లవి వులిక్కిపడి చూసింది.

అందంగా, హుందాగా పట్టుచీర, డైమండ్ నగలతో వున్న ఆమె నాగమణి.

"నాగూ!!" పల్లవి చిన్నగా కేక పెట్టింది.

"అవును. నువ్వేమిటి ఇక్కడ?" ఆమె చేతిని ఆప్యాయంగా పట్టుకుని అడిగింది నాగమణి.

"మా వారి ఆఫీస్ వాళ్ళు ఉగాది వేడుకలని ఈ పార్టీ అరేంజ్ చేసారు. ఫేమిలీతో రావాలి అన్నారని నన్ను తీసుకు వచ్చారు. ఎవరూ తెలీదు. అందుకని ఇక్కడ కూర్చున్నా. పిన్ని బావుందా? మీవారేం చేస్తారు?" అడిగింది.

"మీవారు ఈ ఆఫీస్‌లో పనిచేస్తున్నారా? పేరు?" నాగమణి అడిగింది.

"రమణ"

రోజూ పొద్దున్నే ఫైల్స్‌తో తమ ఇంటికి వచ్చి, భర్తతో చివాట్లు తినే రమణ గుర్తుకొచ్చాడు.

"కొంచెం కాలు ఈడుస్తూ నడుస్తాడు అతనేనా?"

"అవును"

"మరి శేఖర్?"

"మా అత్తయ్య డాక్టర్ కొడుక్కి చాలా కట్నంతో ఇంకో డాక్టర్‌తో పెళ్ళిచేసింది. మామయ్య, అమ్మ ఎంత చెప్పినా వినలేదు. బావకూడా డాక్టర్ అమ్మాయినే ఇష్టపడ్డాడు. ఎక్కువ కట్నం ఇచ్చుకోలేని నాన్న రమణగారితో నాపెళ్ళి చేసాడు. నేను మున్సిపల్ స్కూల్లో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్నాను" చెప్పింది పల్లవి.

"ఓ! మేము మా మామయ్య ఇంటికి వెళ్ళాక, డిగ్రీ చదివిన ఓ పేద అబ్బాయితో నా పెళ్ళిచేసారు. పెళ్ళయ్యాక నా అదృష్టం వల్ల అతను సివిల్స్ రాసి ఈ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో చేరాడు. అమ్మ నా దగ్గరే వుంది. ఓసారి రా. రమణకి మా ఇల్లు తెలుసు. రోజూ పొద్దున్నే వస్తాడు. మా పల్లవి మొగుడని నాకు తెలీదుగా. అందుకని కాఫీ కూడా ఇవ్వను పాపం. ఇప్పుడు తెలిసిందిగా రేపటి నుంచి అతన్ని కూర్చోపెట్టి మాట్లాడమని చెప్తా మావారికి."

నాగమణి వాగ్ధాటిని వింటున్న పల్లవికి, ఆమె హఠాత్తుగా ఎందుకు మాట్లాడటం మానేసిందో, ఇప్పుడు ఎందుకు మాట్లాడుతోందో లీలగా అర్ధమైంది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

**Click here to share your comments on this story**